ముగిసిన 'వికసిత్ భారత్ పార్లమెంట్' ఎంపిక



జ్యూరి సభ్యులను సత్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ జాన్, ప్రిన్సిపాల్ జయంతిరెడ్డి

ఉప్పల్: ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 'వికసిత్ భారత్ పార్లమెంట్' ఎంపిక బుధవారంతో ముగిసింది. 10 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జయంతిరెడ్డి తెలిపారు. వీరు రాష్ట్ర అసెంబ్లీలో జరిగే వికసిత్ భారత్ పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. అనంతరం జ్యూరీ సభ్యులను కళాశాల డైరెక్టర్ జాన్, ప్రిన్సిపాల్ జయంతిరెడ్డి ఘనంగా సత్కరించారు.

రంజాన్‌ను శాంతియుతంగా నిర్వహించుకోవాలి



మసీదు పెద్దలతో మట్లాడుతున్న కార్పొరేటర్ శాంతి


మల్లాపూర్: రంజాన్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. బుధవారం నాచారంలో మసీదు మత పెద్దలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లోని మసీదుల వద్ద ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు. ప్రభుత్వం నుంచి ఇఫ్తార్ విందు కుడా 2 మసీదులను ఎంపిక చేశామన్నారు. మసీదుల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



మల్లాపూర్: నాచారం దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రూపొందించిన డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతి పోస్టర్‌ను బుధవారం నాచారంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల జేఏసీ వ్యవస్థాపకులు నల్లరా ధాకృష్ణ మాట్లాడుతూ.. ఏప్రిల్ 5న బీజేఆర్ 117వ జయంతిని వేడుకను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దళిత సీనియర్ నేత సంజన్న, అంజిమాదిగ, నాచారం డివిజన్ కన్వీనర్ శ్రీరామ్, దళిత సంఘాల జేఏసీ నాయకులు, రాఘవేంద్రనగర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ ప్రతినిధులు తదితరులున్నారు.

సీపీ ఆకస్మిక తనిఖీ



మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు

మేడిపల్లి: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా బుధవారం సాయంత్రం రాచకొండ సీపీ సుధీర్‌బాబు మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో అధికారులు, సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు రాచకొండ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రత పరిరక్షణలో భాగంగా వివిధ పోలీస్‌స్టేషన్‌లలో అధికారులు, సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించేందుకు తనిఖీలు చేశారు. పెట్రోలింగ్ స్టాఫ్ పలు విభాగాల పనితీరు, సీసీటీవీల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశించారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

కుషాయిగూడ: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కీసర శివాజీనగర్‌కు చెందిన చవాన్‌బాబు (38) గోల్డ్‌స్మిత్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 18న డబ్బుల విషయంలో మల్లాపూర్ నివసించే తన బంధువు గంగారాం ఇంటికి బైక్‌పై బయలుదేరి వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో హెచ్‌బీకాలనీ దుర్గావైన్స్ వద్ద ఎదురుగా వచ్చిన అశోక్ లేల్యాండ్ వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తలకు గాయమైన అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు !

- ఏడాది అవుతున్న నేటికి పూర్తికాని పనులు
- నిధుల కొరత ఉందంటున్న అధికారులు



మల్లికార్జుననగర్‌లో పూర్తికాని రోడ్డు పనులు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో డ్రైనేజీ పనులు పూర్తిచేసిన అధికారులు ప్రస్తుత ప్రభుత్వం మారి సుమారు 15 నెలలు కావస్తున్నా.. నిధులలేమితో రోడ్లు వేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

పది నెలలుగా ఇబ్బంది..

మల్లికార్జుననగర్‌లో రోడ్లు, బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులు అసంపూర్ణంగా ఉన్నాయి. వరద ముంపు నివారణకు బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టి సుమారు 10 నెలలు కావస్తున్నా నేటికి పనులు పూర్తి చేయడంలో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సమయం వృథా..

గుంతలమయంగా ఉన్న రోడ్ల కారణంగా రాత్రి వేళల్లో పాదచారులు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారని వాపోతున్నారు. శుభకార్యాలు చేసుకోవాలంటే సుమారు 9 నెలల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. మల్లికార్జుననగర్ రోడ్ నెంబర్ 3, 7 వీధుల్లో రోడ్డు నిర్మాణ పనులు సగం మేర వదిలేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కాలనీవాసులు, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొంటున్నారు. దీనికితోడు నూతనంగా వేసిన 100 డయా పైపులైన్లు వేసినప్పటికీ ఇతర డ్రైనేజీకి నూతనంగా వేసిన పైపులైన్లకు అనుసంధానం చేయకపోవడంతో డ్రైనేజీ నీరు రోడ్లపై ఏరులై పారుతుందని తెలిపారు.

జ్యోతినగర్‌లో గుంతలమయమైన రోడ్లు..

జ్యోతినగర్ కాలనీలోని పలు వీధుల్లో రోడ్లకు గుంతలు ఏర్పడి అధ్వాన్నంగా ఉన్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. ఇంటి ముందు అధ్వాన్నంగా ఉన్న రోడ్లతో ప్రతిరోజు ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ఇటీవల రోడ్లు వేయాలని సర్కిల్ ఉపకమిషనర్‌కు సైతం వినతిపత్రం అందజేశామని, ఇప్పటికైనా రోడ్లు వేయాలని కోరారు.



జ్యోతినగర్‌లో అధ్వాన్నంగా ఉన్న రోడ్డు

డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయండి..



మల్లికార్జుననగర్ కాలనీలో అసంపూర్ణంగా ఉన్న రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు సంబంధిత అధికారులు త్వరగా పూర్తి చేయాలి. ఏడాదిగా రోడ్లు అధ్వానంగా ఉండటంతో ఇబ్బంది పడుతున్నాం. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

– సత్యనారాయణ, మల్లికార్జుననగర్

అవస్థలు పడుతున్నాం...



జ్యోతినగర్‌లో అండర్ గ్రౌండ్ పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి చేసి ఏడాదవుతోంది. పైపులైన్ నిర్మాణం కోసం రోడ్లను తవ్వి వదిలేశారు. పనులు పూర్తైన అధికారులు రోడ్లు తిరిగి వేయడం లేదు. ఇటీవల సర్కిల్ అధికారులకు వినతి పత్రం అందజేసినా ఫలితం కనిపించడం లేదు.

– మాశెట్టి ధనలక్ష్మి, జ్యోతినగర్

త్వరలో పనులను పూర్తి చేస్తాం..

గౌతంనగర్ డివిజన్ పరిధి మల్లికార్జుననగర్, జ్యోతినగర్ తదితర ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే పనులను ప్రారంభిస్తాం.

– ఏఈ, దివ్యజ్యోతి

బస్సు సర్వీసులను పునరుద్ధరించండి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



మంత్రి పొన్నంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గంలో కొత్త బస్సురూట్లతో పాటు, రద్దు చేసిన సర్వీసులను పునరుద్ధరించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మల్కాజిగిరిలో కొత్తరూట్లలో బస్సుసర్వీసుల కోసం గతంలో అధికారులు, మంత్రి దృష్టికి తీసుకుని వచ్చామన్నారు. బస్సులో ప్రయాణించే ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుందన్నారు.

- మచ్చబొల్లారం నుంచి చార్మినార్, ఈసీఐఎల్, మెహిదీపట్నం, కొకూర్ నుంచి యాప్రాల్ మీదుగా ఈసీఐఎల్‌కు, బాలాజీనగర్ నుంచి ఈసీఐఎల్‌కు యాప్రాల్ మీదుగా, సికింద్రాబాద్ నుంచి వయా కాకతీయనగర్, సాయినాథపురం మీదుగా, ఆర్టీసీ కాలనీ నుంచి ఈసీఐఎల్, ఈసీఐఎల్ నుంచి వయా ఆర్టీసీకాలనీ మీదుగా అఫ్జల్‌గంజ్, సికింద్రాబాద్ నుంచి ఐఎన్‌నగర్‌కు వయా మహేంద్రహిల్స్, రామాంజనేయనగర్ మీదుగా నూతన బస్సు సర్వీసులు నడపాలని కోరామన్నారు.
- సికింద్రాబాద్ నుంచి 16ఎ, 16ఎస్, 16పి, 21, 25ఎస్ రూట్లలో సర్వీసులు పెంచడంతో పాటు రద్దు చేసిన 16ఏఎస్ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరామన్నారు. గోల్నాక పోలీస్‌స్టేషన్(అల్వాల్), మీర్జాలగూడ, సాయినగర్ క్రాస్‌రోడ్, యాప్రాల్ గవర్నమెంట్‌స్కూల్, నేరెడ్‌మెట్ బాపూజీనగర్, యాప్రాల్ అంబేద్కర్ విగ్రహం, ఎం.ఆర్.కృష్ణన్ విగ్రహం వద్ద బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

'ఓటీఎస్'ను సద్వినియోగం చేసుకోండి

ఐలా మేనేజింగ్ కమిటీ సమావేశంలో చైర్మన్ రోషిరెడ్డి



ఐలా మేనేజింగ్ కమిటీ సమావేశంలో చైర్మన్ రోషిరెడ్డి

కుషాయిగూడ: ఆస్తిపన్ను చెల్లింపులో (ఓటీఎస్) 'వన్ టైమ్ సెటిల్‌మెంట్' అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐలా చైర్మన్ జక్కా రోషిరెడ్డి పారిశ్రామికవేత్తలకు సూచించారు. చర్లపల్లి పారిశ్రామికవాడలోని ఐలా కార్యాలయంలో బుధవారం జరిగిన ఐలా మేనేజింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటీఎస్‌లో భాగంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి పెరిగిన వడ్డీపై 90 శాతం మాఫీ లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికభారాన్ని తగ్గించుకోవాలని ఆయన సూచించారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట..

చర్లపల్లి పారిశ్రామికవాడ అభివృద్ధికి కట్టుబడి ఉండటంతో పాటుగా పారిశ్రామికవేత్తలకు అనువైన వాతావరణాన్ని అందించడం కోసం ఐలా కృషి చేస్తుందన్నారు. ముఖ్యంగా మౌలికవసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. గోల్డ్‌స్టోన్ నుంచి గణేష్‌టెంపుల్ ఆర్చ్ వరకు 4 లేన్ల రోడ్డు విస్తరణ పనులు త్వరలోనే ప్రారంభంకానున్నట్లు వివరించారు. ఎంఎస్‌ఎంఈ–సీడీపీ పథకం కింద కేంద్రప్రభుత్వం అందజేసిన రూ.6 కోట్ల గ్రాంటుకు ఐలా తన వాటాగా రూ.4 కోట్లను అందించిందన్నారు.

రూ.10 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు

రోడ్డు విస్తరణ పనులతో పాటు ఫుట్‌పాత్‌లు, రోడ్డు లెవలింగ్, సెంటర్ వెర్జ్, వీధిదీపాల ఏర్పాటు వంటి పనులు చేపట్టి రవాణా వ్యవస్థను మరింత పటిష్టం చేసేలా కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు. ఐలా కమిషనర్ ప్రభాకర్, సెక్రటరీ వెంకటేశ్వర్‌రెడ్డి, కోశాధికారి వెంకట్రాంరెడ్డి, వైస్ చైర్మన్ పీ.ఎస్.ఎస్. ప్రసాద్, జాయింగ్ సెక్రటరీ హనుమాన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



మాట్లాడుతున్న వజ్రేష్‌యాదవ్



ఆనంద్‌బాగ్‌లో..

కాప్రా: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదించడంతో కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేస్తూ గాంధీనగర్‌లో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ.. 30 ఏళ్ల కల సాకారం చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సుప్రీంకోర్టులో సానుకూల తీర్పు ఇచ్చిన గంటలోపే ఎస్సీ వర్గీకరణకు తమ ప్రభుత్వం అనుకూలమని ప్రకటించి 7 నెలల్లోనే ప్రక్రియను పూర్తిచేయడం చరిత్రాత్మకమన్నారు. కాంగ్రెస్ నేతలు సత్యనారాయణ, శ్రీహరి, అరుణ్ కిరణ్, బాలయ్య, హరి, మనోజ్, రాంచందర్, రవి, సురేష్, మహేష్, మధు, లక్ష్మి, మణెమ్మ, స్వరూప, అరుణ, శైలజ తదితరులున్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం..

మల్కాజిగిరి: కాంగ్రెస్‌తోనే సంక్షేమం సాధ్యమవుతుందని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించిన సందర్భంగా బి– బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆనంద్‌బాగ్ చౌరస్తాలో సంబరాలు నిర్వహించి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రేమ్‌కుమార్, వెంకటేష్‌యాదవ్‌లు మాట్లాడుతూ.. దేశంలో కులగణన చేపట్టి రేవంత్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. బీసీల సంక్షేమం కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. రాజీవ్ యువవికాసం ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నారన్నారు. చంద్రశేఖర్, శ్రీనివాస్, ఉమేష్‌సింగ్, సంపత్‌గౌడ్, వినోద్‌యాదవ్, ప్రవీణ్, శ్రీనివాస్‌యాదవ్, సంతోష్, శంకర్, కన్న తదితరులున్నారు.

బోడుప్పల్: బీసీబిల్లు, ఎస్సీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డికి బుధవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు నర్సింహ్మారెడ్డి, మాజీ మేయర్ అజయ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, మేడ్చల్ బీ– బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు

బోడుప్పల్: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అన్నారు. ఆయన పదోతరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించి పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. బయట చిరుతిళ్లు తినకుండా, తేలికపాటి ఆహారం తీసుకోవాలని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు.

ఫ్లైఓవర్ పనులు పూర్తి చేయాలి

ఉప్పల్: ఉప్పల్ నుంచి నారాపల్లి వరకు ఫ్లై ఓవర్ పనులను వెంటనే పూర్తిచేయాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మార్చి 22న ఉదయం 9.30 నుంచి చర్లపల్లి చౌరస్తా నుంచి ఉప్పల్ రింగ్‌రోడ్డు వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జె. వెంకన్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సీపీఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రారంభిస్తారన్నారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం



అల్వాల్‌లో సంబరాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు

అల్వాల్: చట్టసభలో ఎస్సీ రిజర్వేషన్ల అమలు చట్టబద్ధత కల్పించుకున్న సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు అల్వాల్‌లో పెద్దఎత్తున సంబరాలు చేశారు. శాసనసభలో మద్దతు పలికిన వివిధ రాజకీయ పార్టీల ఎమ్మెల్యేలు, ఎంపీలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 30 ఏళ్లపాటు పోరాటం చేసిన మందకృష్ణ మాదిగ చిత్రపటాని పాలాభిషేకం చేశారు. కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్, నాయకులు అశోక్‌రెడ్డి, రాంచందర్, స్వామి, యాదగిరి, ఆనంద్, రాజు, రమేష్, శివశంకర్, రాజయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో కార్పొరేటర్ సమీక్ష

అల్వాల్: వేసవిని దృష్టిలో ఉంచుకుని అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో మచ్చబొల్లారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మచ్చబొల్లారం డివిజన్ పరిధిలో నీటిసరఫరా, డ్రైనేజీలు, యూజీడీ లైన్లు, బాక్స్‌డ్రైన్లు, స్టోర్మ్ వాటర్ డ్రైన్లు డీసిల్టింగ్ మరమ్మతులు తదితర సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ తెలిపారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, జలమండలి డీజీఎం సాంబయ్య, ఈఈ శ్రీకాంతి, డీఈ రఘు, ఏఈ రవళి తదితరులున్నారు.

డబ్బులు ఆశచూపి.. అందినకాడికి దోచుకుని..

పోలీసునంటూ బెదిరిస్తున్న కి'లేడీ'

కుషాయిగూడ: అధిక డబ్బులు, ఉద్యోగాల ఆశచూపి అందినకాడికి దండుకుంది. తేరుకున్న బాధితులు ప్రశ్నించడంతో తాను రిటైర్డ్ పోలీసు అధికారినంటూ బెదిరింపులకు దిగింది. ఈ ఘటన చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపల్లి ఐజీ మింట్, గణేష్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఆదిలక్ష్మి అలియాస్ శ్రీదివ్యకాలనీలో మగ్గం వర్క్ చేసుకుంటూ కూమార్తెతో కలిసి ఉంటుంది. ఈ క్రమంలో తన వద్దకు మగ్గం వర్క్ కోసం వచ్చే మహిళలను మచ్చిక చేసుకుని వారికి మాయమాటలు చెప్పి బుట్టలోకి దించింది. రూ.1000 కడితే వారంలో రూ.10వేలు ఇస్తానని, రూ.లక్ష ఇస్తే స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టి గంటల వ్యవధిలో రూ.20–25 వేలు అధికంగా ఇస్తానంటూ.. నమ్మబలికి సుమారు 100 మంది మహిళల వద్ద నుంచి రూ.కోట్లు వసూలు చేసినట్లు సమాచారం.

అనుమానం వచ్చి అడిగితే దాటవేస్తూ..

ఆమె తీరుపై అనుమానం వచ్చిన కొంతమంది తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా మొండికేసింది. డబ్బుల కోసం ఒత్తిడి చేస్తే తాను రిటైర్డు పోలీసు అధికారినంటూ బెదిరింపులకు దిగింది. దీంతో దిక్కుతోచని స్థితిలో పడిన మహిళలు పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. కానీ పోలీసులు ఈ విషయాన్ని ఇంకా ధ్రువించకపోవడం గమనార్హం.

పలు కేసుల్లో నిందితురాలు..



పోలీసు అధికారిణి వేషధారణలో ..

తోటి మహిళలను బురిడీ కొట్టించి రూ.కోట్లు దండుకున్న కిలాడీ లేడిని చర్లపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. సదరు మహిళపై మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో 2 కేసులు, మరోస్టేషన్‌లో ఇంకో కేసు ఉన్నట్లు సమాచారం.

విచారణకు సహకరించడం లేదు..

సదరు నిందితురాలి సమాచారం సేకరించి విచారణ జరుపుతున్నా పోలీసులకు సహకరించడం లేదని, పోలీసులను కూడా బ్లాక్‌మేల్ చేస్తున్నట్లు తెలిసింది. మేడిపల్లిలో మగ్గం మిషన్ల కొనుగోళ్లపై అవినీతికి ఆమె పాల్పడిందని, ఈ కేసులో కూడా నిందితురాలని తెలుస్తోంది.

'దేహం' పుస్తకావిష్కరణ

రామంతాపూర్ : ప్రముఖ రచయిత నర్సింగరావు రచించిన 'దేహం' అనే పుస్తకాన్ని రామంతాపూర్ బాల భారతి స్కూల్‌లో ప్రముఖ విద్యావేత్త సీనియర్ సిటిజన్ సంఘం అధ్యక్షుడు నత్తిరాజు కుర్తీశ్వర్‌రావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. మానవ దేహం దేవాలయం వంటిదని, దేవాలయాన్ని మనం అధ్యాత్మికతకు నిలయంగా చూస్తామన్నారు. మనదేహాన్ని కూడా మంచిఅలవాట్లతో వ్యాధులు దరిచేరకుండా కాపాడుకోవాలన్నారు. ఈ పుస్తకంలో మనదేహాన్ని ప్రకృతి ప్రసాదించిన ఆహారం తింటూ ఏ విధంగా కాపాడుకోవాలోనని రచయిత అందరికీ అర్థమయ్యే రీతిలో వివరించడం ప్రశంసనీయమన్నారు. రచయిత నర్సింగరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం సమయభారం వల్ల చాలామంది ఇంటి భోజనం మానేసి బయట తిండికి అలవాటు చేసుకుంటున్నారన్నారు. దీంతో దేహంలో మలినాలు చేరి అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ప్రకృతిపరంగా లభించే ఆహారపదార్థాలను ఇంట్లోనే వండుకుని తింటే మనదేహానికి ఎలాంటి వ్యాధులు దరిచేరవన్నారు.